
సాక్షి మెదక్

గురువారం । 31 । ఆగస్టు । 2023



డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

అక్కన్నపేట మండలం పంతుల్ తండాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి విదేశీ పంట అయిన డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నాడు. 8లో



రూ.10 లక్షల డ్రగ్స్ పట్టివేత

రూ.10లక్షలు విలువ చేసే నిషేధిత టాబ్లెట్లు, ఇంజక్షన్ల (డ్రగ్స్)ను కొల్లూరు, ఎస్‌ఓటీ పోలీసులు, యాంటీ డ్రగ్స్ కార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో



చట్టబద్ధంగా సహాయం చేయాలి

రాజీ చేయగలిగే కేసులలో కక్షిదారులకు పోలీసు అధికారులు చట్టబద్ధంగా సహాయం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత సూచించారు. 9లో



రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు



రాఖీ సందడి

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. పట్టణంలో జే.ఎన్‌రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతంలో దుకాణాల్లో రంగురంగుల రాఖీలు కొలువుదీరాయి. యువతులు, మహిళలు రాఖీలను కొనేందుకు ఆసక్తి చూపారు. స్వస్తిక్, రుద్రాక్ష, ముత్యం, పగడం, వినాయకుడు, ఆంజనేయ బొమ్మలతోపాటు పిల్లలను ఆకర్షించే వివిధ రకాల మోడళ్లతో కూడిన కార్టూన్, స్వచ్ఛమైన పత్తితో తయారు చేసిన కాషాయ రాఖీలను కొనేందుకు వచ్చిన వారితో దుకాణాలు కళకళలాడాయి. - మెదక్ మున్సిపాలిటీ

న్యూస్‌రీల్

అన్నివర్గాలకు సమన్యాయం



మాట్లాడుతున్న రాజనరసింహ

రామాయంపేట (మెదక్): కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు విషయంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. బుధవారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పీసీసీ సభ్యులు సుప్రభాత రావు, మ్యాడం బాలకృష్ణ, కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామాయంపేట, మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, హఫీజ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు అశోక్ నాయక్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, నాయకులు గుండా స్వామి, ప్రసాద్ గౌడ్, అల్లాడి వెంకటేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



అవగాహన కల్పిస్తున్న అధికారి మల్లయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమని మానవ రవాణా నిరోధక శాఖ జిల్లా ఇన్‌చార్జ్ మల్లయ్య అన్నారు. మేలుకొలుపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, షీటీం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, మహిళలు, బాలికలను వేధింపులకు గురి చేస్తే షీటీంను సంప్రదించాలన్నారు. యువత ప్రలోభాలకు లొంగకుండా లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తారాసింగ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఎస్‌ఐ షేక్ మహబూబ్, పోలీస్ కళాబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మెదక్: గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించి ప్రధాని మోదీ మహిళలకు రాఖీ కానుక అందించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, నల్లాల విజయ్, మధు, కోరే ఎల్లన్న, మండల అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాగరాజు, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్

పెద్దశంకరంపేట(మెదక్): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. బుధవారం మండలంలోని టెంకటి, కట్టెల వెంకటాపూర్‌లో పర్యటించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరులో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ గ్రేస్ బాయిని కలిసి కోరారు. సకాలంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైహింద్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాయిని మధు, పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జైపాల్ గౌడ్, రవీందర్, రఘుపతి రెడ్డి, సాయిలు, జహంగీర్, భాను తదితరులున్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలేవి?



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మెదక్ కలెక్టరేట్: కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా పొల్యూషన్ కంట్రోల్ అధికారులను ప్రశ్నించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. విద్యా, వైద్య, గ్రామీణాభివృద్ధి, ఆర్టీసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమలు, పంచాయతీ రాజ్, రోడ్డు ట్రాన్స్‌పోర్టేషన్, భగీరథ, నీటి పారుదల, రోడ్లు, భవనాల శాఖలపై సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నశంకరంపేట మండల కేంద్రంలో రాధాస్టీల్ పరిశ్రమ నుంచి వస్తున్న పొల్యూషన్‌తో సమీప ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పరిశ్రమను పరిశీలించారా.. అని పొల్యూషన్ ఈఈ కుమార్‌ను ప్రశ్నించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, త్వరగా పరిశ్రమను సందర్శించి రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు.

కోఆర్డినేషన్ అవసరం..

తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి మరమ్మతులు ఎందుకు చేయించడం లేదని జిల్లా వైద్య అధికారి చందునాయక్‌ను ప్రశ్నించారు. జెడ్పీ నిధులు మంజూరు చేసినా మరమ్మతులు ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని డీఎంహెచ్‌ఓ చెప్పగా, ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు తూప్రాన్ ఆస్పత్రి వైద్యులు అమరసింగ్ తెలిపారు. స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమావేశాలు నిర్వహించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

తూప్రాన్, చిన్నశంకరంపేట, చేగుంట మండలాల్లో పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, పీఎంఈజీపి ద్వారా ఈ ఏడాది 30 యూనిట్లు అందజేసినట్లు జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణమూర్తి తెలిపారు. జిల్లాలో విద్యార్థులకు ఒక జత యూనిఫాంలు అందజేసినట్లు డీఈఓ కార్యాలయ అధికారి జ్యోతి తెలిపారు. చేగుంట మండలం కర్నాల్‌పల్లి, మక్కరాజిపేట పాఠశాలలకు టీచర్లు రావడం లేదని, ఈ విషయంపై రిపోర్ట్ ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశించారు. సమాచారం ఇచ్చినా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ సమావేశానికి హాజరు కాకపోవడం మెమో జారీ చేయాలని జెడ్పీసీఈఓకు సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి స్వామి మాట్లాడుతూ జిల్లాలో 15 బ్రాంచ్ గ్రంథాలయాలు, 22 పంచాయతీ గ్రంథాలయాలు ఉన్నాయని, 8 మందితో ఈ గ్రంథాలయాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. నర్సాపూర్ గ్రంథాలయం ఎందుకు పూర్తి చేయలేదని జెడ్పీటీసీ బాబ్యా నాయక్ ప్రశ్నించగా.. నిధులు లేక ఆలస్యం జరుగుతుందని ఆయన సమాధానం ఇచ్చారు. ఆర్టీఏ ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.4.40కోట్ల ఆదాయం సమకూరుతుందని ఆర్టీఏ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలుపగా, గమ్యం యాప్‌తో ప్రయాణీకులకు మెరుగైన సేవలందిస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సమావేశాలలో జెడ్పీ సీఈఓ వెంకట శైలేష్, జెడ్పీటీసీలు బాబ్యా నాయక్, మాధవి రాజు, కృష్ణారెడ్డి, సౌందర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: బీఎల్‌ఓలు దృష్టి సారించి ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలననారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రచారం చేయాలని, స్త్రీ, పురుష నిష్పత్తి ప్రకారం ఓటర్లు నమోదయ్యేలా చూడాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి అర్హులను ఓటరుగా నమోదు చేయించాలని, ఫారం 6, 7, 8లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రాజకీయపార్టీల ఏజెంట్లు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులతో చర్చించి చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, పక్కాగా సవరణ చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎన్నికల అధికారులకు అందిస్తే అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎఫ్‌ఓ రవిప్రసాద్, ఆర్‌డీఓలు అంబదాస్ రాజేశ్వర్, జయ చంద్ర, డీడబ్ల్యూఓ బ్రహ్మాజి, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గమ్మకు పల్లకీ సేవ

మండలంలోని ఏడుపాయల వనదుర్గ ఆలయంలో బుధవారం సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఈఓ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహంతో ఊరేగించారు. పూజారులు పార్థివ శర్మ, శంకర శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. - పాపన్నపేట(మెదక్)

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జడ్జి లక్ష్మిశారద

మెదక్ మున్సిపాలిటీ: సెప్టెంబర్ 2 నుంచి 9తేదీ వరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించే లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి లక్ష్మిశారద అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ముందస్తు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకొని లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

డీడీలు కట్టించారు.. టెండర్ మరిచారు



పట్టణంలోని పాత బస్టాండ్ ఎదురుగా మున్సిపల్ దుకాణ సముదాయం

- మున్సిపల్ దుకాణాల వేలంపై జాప్యం
- ఆరు నెలలుగా ముందుకుసాగని వైనం
- టెండర్లు నిర్వహించాలంటున్న దరఖాస్తుదారులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ స్థిరాస్తి వేలంపై తీవ్ర జాప్యం నెలకొంది. రాజకీయ ఒత్తిళ్లతో ఈ ప్రక్రియ ముందుకు సాగడంలేదనే ఆరోపణలున్నాయి. దుకాణాల లీజు వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు ఇటీవల అధికారులు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. మూడేళ్ల కాల పరిమితితో దుకాణాలను లీజుకు తీసుకున్న వ్యాపారులు గడువు ముగిసినా షాపులను ఖాళీ చేయడం లేదు. దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడుతోంది.

30ఏళ్ల క్రితం లీజు...

పట్టణంలోని పాత బస్టాండ్ ఎదుట 17 దుకాణాలను 30 ఏళ్ల క్రితం వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. వ్యాపార పరంగా డిమాండ్ ఉన్న ప్రాంతంలో దుకాణాలున్నా.. మున్సిపాలిటీకి మాత్రం ఆదాయం అంతంతగానే వస్తోంది. గతంలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అద్దెలు చెల్లించకపోవడంతో బల్దియా ఆదాయం భారీగా తగ్గుతోంది. కొంతమంది తమ దుకాణాలను సబ్ లీజ్‌కు ఇస్తూ అధిక అద్దె వసూలు చేసుకుంటూ లబ్ధి పొందుతున్నారనే ఆరోపణలున్నాయి.

వేలానికి సాకులు..

పట్టణంలోని మున్సిపల్ దుకాణాలకు వేలం నిర్వహించాలని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆరు నెలల క్రితం వేలం వేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో 17 దుకాణాలకు రీ టెండర్లు వేస్తామని మున్సిపల్ అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించారు. దుకాణాలు దక్కించుకునేందుకు ఆశావహులు రూ.5వేల చొప్పున అప్లికేషన్ ఫాంలు కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా వేలం నిర్వహించకపోవడంతో వీరికి ఎదురుచూపు తప్పడంలేదు. వేలం విషయమై దుకాణాల్లో ఉన్న వారు గతంలో కోర్టును ఆశ్రయించగా, రీటెండర్లు వేయాలని, దుకాణదారులు 4 నెలల్లో ఖాళీ చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కాగా గడువు ముగిసినా వ్యాపారులు దుకాణాలను ఖాళీ చేయడంలేదని, టెండర్లు వేయకుండా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. దుకాణం దక్కుతుందనే ఆశతో డీడీలు కట్టామని, వేలం జాప్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోర్టుకు వెళ్లడంతో ఆలస్యం

మున్సిపల్ దుకాణాల్లో ఉన్న వారు కోర్టుకు వెళ్లడంతో టెండర్ ప్రక్రియ ఆలస్యమైంది. కోర్టు కూడా రీ టెండర్ వేసుకోవచ్చని, దుకాణదారులు ఖాళీ చేసేందుకు 4 నెలల సమయం ఇవ్వాలని చెప్పడంతో వేలం ప్రక్రియలో జాప్యం జరిగింది. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు త్వరలో వేలం వేస్తాం.

- జానకీరాం సాగర్, మున్సిపల్ కమిషనర్, మెదక్

అప్పు చేసి దరఖాస్తు చేశా..



దుకాణం వస్తే ఉపాధి పొందవచ్చనే ఆశతో అధిక వడ్డీకి అప్పుచేసి డీడీ కట్టా. అధికారులు దుకాణాల వేలం ఆలస్యం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆరు నెలలుగా ఎవరూ పట్టించుకోవడంలేదు. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరిగిపోతోంది. ఏం చేయాలో అర్థం కావడంలేదు. - ప్రవీణ్, మెదక్

వేలం త్వరగా నిర్వహించాలి



దుకాణాల కోసం డీడీలు కట్టి ఆరు నెలలు అవుతోంది. బినామీ దుకాణాదారులు, వ్యాపారులతో కుమ్మక్కై టెండర్లను అడ్డుకుంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి త్వరగా వేలం జరిగేలా చూడాలి. - ప్రభాకర్, మెదక్.

తగ్గిన 'బండ' భారం

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు కొంత ఊరటనిచ్చింది. ఒకేసారి రూ.200లు తగ్గడంతో మధ్యతరగతి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలో సిలిండర్ ధర పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. ఒక్కోసారి నెలలో 2 నుంచి 3 సార్లు పెంచిన సందర్భాలున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం సిలిండర్‌పై అందిస్తున్న రూ.46 సబ్సిడీతో కలిపి తాజా తగ్గింపుతో వినియోగదారులకు ఇక నుంచి దాదాపు రూ.246లు ఆదా కానున్నాయి.



- సామాన్యుడికి ఊరట
- సిలిండర్ ధర రూ.200 తగ్గించిన కేంద్రం
- జిల్లాలో నెలకు రూ.4.69 కోట్ల ఆదా
- సంతోషం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

మెదక్: జిల్లాలో అన్నిరకాల గ్యాస్ కనెక్షన్లు కలిపి 2,35,412 ఉండగా, అందులో 460 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన 2,34,952 వివిధ పథకాల కింద గృహ అవసరాలకు ఉపయోగించేవి. ఇందులో 1,08,688 కనెక్షన్లు వినియోగదారులు నేరుగా తీసుకున్నవి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్‌ఆర్) కింద 29,485 తీసుకోగా, ఉజ్వల పథకం కింద 33,618, దీపం పథకం కింద 63,161 ఉన్నాయి. జిల్లాలో 17 ఏజెన్సీల ద్వారా ప్రజలకు నిత్యం వీటిని సరఫరా చేస్తున్నారు. ఓపెన్ మార్కెట్లో సిలిండర్‌కు రూ.1,218 ఉండగా ప్రభుత్వం రూ.46 సబ్సిడీ అందిస్తోంది. తగ్గిన ధరతో జిల్లాలో వినియోగదారులకు నెలకు రూ.4,69,90,400లు ఆదా కానున్నాయి.

'ఉజ్వల'కూ వర్తింపు..

సర్కారు పేదలకు ఉజ్వల పథకం కింద అందిస్తున్న సిలిండర్‌కు రూ.972 వసూలు చేస్తోంది. కాగా తగ్గిన ధరను ఉజ్వల లబ్ధిదారులకు కూడా అందించనుంది. దీంతో వీరికి సిలిండర్ రూ.772లకే దొరుకుతుంది. జిల్లాలో ఉజ్వల పథకం కింద, 33,618 కనెక్షన్లకు నెలకు రూ.67,23,600 ఆదా కానున్నాయి. కాగా ఎన్నికల స్టంట్‌లో భాగంగా కేంద్రం గ్యాస్ ధర తగ్గించిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే రూ.500లకే సిలిండర్ అందిస్తామని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్రం సిలిండర్‌పై రూ.200లు తగ్గించిందనే విమర్శలున్నాయి. ఎన్నికల తర్వాత బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ధర పెంచుతుందా.? లేక తగ్గించిన ధరకే అందిస్తుందా.. అనేది తెలియాల్సి ఉంది.

సంతోషంగా ఉంది



పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న మధ్య తరగతి వారికి కేంద్రం గ్యాస్ ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించడం కాస్త ఊరటనిచ్చే విషయం. సామాన్యులపై భారం తొలగించేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి.

- నాలం కవిత, చల్మెడ, నిజాంపేట మండలం

క్లుప్తంగా

అక్షయపాత్ర వాహనం బోల్తా



రోడ్డు పక్కన బోల్తాపడిన బొలేరో

వెల్దుర్తి(తూప్రాన్‌): మండల పరిధిలోని ఉప్పు లింగాపూర్‌ గ్రామ శివారులో వాహనం బోల్తా పడింది. బుధవారం సంగారెడ్డి నుంచి బొలేరో వాహనంలో అక్షయపాత్ర భోజనం తీసుకొచ్చి వెల్దుర్తి పాఠశాలలో అందజేశారు. అక్కడి నుంచి చిన్నశంకరంపేట మండలం దర్పల్లి పాఠశాలకు వెళ్తుండగా ఉప్పులింగాపూర్‌ శివారులోని మూలమలుపు వద్ద వాహనం బోల్తా పడింది. అందులోని భోజనమంతా నేలపాలైంది. బీటీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకర వల్ల వాహనం అదుపుతప్పినట్లు తెలుస్తోంది.

బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ సభ్యుడిగా అనిల్‌ రెడ్డి



నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాక: దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్‌ నాయకుడు మంద అనిల్‌రెడ్డి బీజేపీ స్టేట్‌ కౌన్సిల్‌ సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆయనకు నియామక పత్రాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ దేవిరెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌, రమేష్‌ రెడ్డి, నేహాల్‌గౌడ్‌ ఉన్నారు.

మోటార్‌ సైకిళ్లను అందించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కార్మికులకు మోటార్‌ సైకిళ్లను అందివ్వాలని బిల్డింగ్‌ అండ్‌ అదర్‌ కన్‌స్ట్రక్షన్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌ అన్నారు. బుధవారం ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, జిల్లా సహాయ కార్యదర్శి పోతిరెడ్డి రాజు, కమిటీ సభ్యులు బాలయ్య యాదయ్య, అంతయ్య, మహేందర్‌, శ్రీనివాస్‌, సత్యం, బాబు, నర్సవ్వ పాల్గొన్నారు.

డ్రాగన్‌ సాగు.. లాభాలు బాగు

- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- మార్కెట్‌లో భలే డిమాండ్‌
- ఆసక్తి చూపుతున్న రైతులు





డ్రాగన్‌ ఫ్రూట్‌ సాగు

హుస్నాబాద్‌: పంటల సాగులో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. సంప్రదాయ పంటలే కాకుండా మార్కెట్‌లో డిమాండ్‌ ఉన్న వాటిని సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. విదేశాల్లో అధికంగా పండించే డ్రాగన్‌ ఫ్రూట్‌ పంటను అక్కన్నపేట మండలం పంతుల్‌ తండాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి దుద్యానాయక్‌ సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నాడు.

దుద్యానాయక్‌కు వారసత్వంగా రెండున్నర ఎకరాలు వచ్చింది. గతంలో వర్షాధార పంటలైన మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేసేవాడు. సరిగా నీరు అందక నష్టాలు చవిచూసేవాడు. ఆ సమయంలో డ్రాగన్‌ ఫ్రూట్‌ పంట గురించి తెలుసుకున్నాడు. సాగు విధానం, పెట్టుబడి ఖర్చు, వచ్చే ఆదాయం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. దీని ద్వారా అధిక లాభాలు పొందవచ్చని భావించి డ్రాగన్‌ ఫ్రూట్‌ సాగుకు పూనుకున్నాడు. ఐదేళ్ల నుంచి పంట పండిస్తున్నాడు. రెండేళ్ల నుంచి ఆయన దిగుబడి పొందుతున్నాడు.

2 వేల మొక్కలు.. 500 సిమెంట్‌ స్తంభాలు

డ్రాగన్‌ ఫ్రూట్‌ను అన్ని రకాల నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటకు నీళ్ల అవసరం కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఈ పంట తీగలాగా ఎదుగుతుంది. ఈ పంటను రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తే 500 సిమెంట్‌ స్తంభాలు అవసరం ఉంటుంది. వాటి పొడవు 7 ఫీట్లు ఉండాలి. స్తంభానికి నాలుగు చొప్పున మొత్తం 2వేల మొక్కలు నాటుతారు. స్తంభాల మధ్య 9 ఫీట్ల దూరం ఉండాలి. సిమెంట్‌ స్తంభానికి రూ.250, పైన టైర్‌, సిమెంట్‌ రింగ్‌ రూ.100, మొక్క కొనుగోలుకు రూ.106 చొప్పున ఖర్చు అవుతుంది. ప్రతీ ఏడాది జూన్‌ నెల నుంచి 5 నెలల వరకు పంట దిగుబడి వస్తుంది. మొక్క పెరుగుతున్నా కొద్దీ కాండం పక్కకు పాకకుండా ఎప్పటికప్పుడు కట్‌ చేస్తూ ఉండాలి.

సేంద్రియ ఎరువులతో మేలు

డ్రాగన్‌ ఫ్రూట్‌ పంటకు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల ఉపయోగం ఉంటుంది. ఆవు పేడలో వరి కంపోస్ట్‌ను మిశ్రమంగా చేసి పంటకు వేస్తారు. ఏదైనా చీడ పురుగు సోకితే వేప నూనె పడతారు. డ్రిప్‌ ద్వారా నాలుగు రోజులకు ఒకసారి పంటకు నీటిని అందిస్తారు. డ్రాగన్‌ పంటకు కీటకాలు, పక్షులు, జంతువుల బెడద ఉండదు. ఇవేవి ఆ పంట దరిచేరవు.

మార్కెట్‌లో మంచి గిరాకీ

రెండు రకాల డ్రాగన్‌ ఫ్రూట్స్‌ ఉంటాయి. తెలుపు, పింక్‌ కలర్‌లో ఉంటాయి. పింక్‌ పండు రుచికరంగా ఉంటుంది. విదేశాల్లో మంచి డిమాండ్‌ ఉన్న డ్రాగన్‌ ఫ్రూట్‌కు దేశీయంలో కూడా దీనిని తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సీజన్‌లో ఒక్కో చెట్టుకు దాదాపు 70 నుంచి 80 పండ్లు కాస్తాయి. వరంగల్‌, సిద్దిపేట, కరీంనగర్‌ మార్కెట్లలో కిలో పండు రూ.200 చొప్పున అమ్ముడుపోతుంది. ఈ లెక్కన 2 వేల చెట్లకు లక్షల రూపాయల్లో ఆదాయం వస్తుంది. ఒక పండు 250 గ్రాముల నుంచి 300 గ్రాముల బరువు ఉంటుంది. మార్కెట్‌లో ఒక పండుకు రూ.150 నుంచి 200 వరకు ధర ఉంటుంది.

ఔషధ గుణాలు పుష్కలం

డ్రాగన్‌ ఫ్రూట్స్‌లో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. ప్రొటీన్లు ఎక్కువగా ఉండి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. రక్తంలోని అనవసరపు కొవ్వును తీస్తూ హిమోగ్లోబిన్‌ పెంచుతుంది. శరీరంలో చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుతుంది. ప్లేట్‌లేట్స్‌ తగ్గినప్పుడు మంచి ఔషధంగా డ్రాగన్‌ పని చేస్తుంది. మలబద్ధకం, క్యాన్సర్‌ వంటి వ్యాధులకు కూడా ఈ పండు గొప్ప ఔషధంగా పని చేస్తుంది. కరోనా వ్యాధి నివారణకు డ్రాగన్‌ ఫ్రూట్స్‌ ఎంతగానో ఉపయోగపడుతుంది. కరోనా సమయంలోనే దీని విశిష్టత గురించి అందరికీ తెలిసింది.



పంట లాభదాయకం

మొక్కజొన్న, పత్తి పంటలు వేస్తే నీళ్ల సరిపోక నష్టం వచ్చేది. డ్రాగన్‌ ఫ్రూట్‌ పంట వివరాలు తెలుసుకొని రెండున్నర ఎకరాలలో సాగు చేశాను. కూలీలు లేకుండా కుటుంబ సభ్యులతో పంట వేశాను. రెండేళ్ల వరకు ఆశించిన దిగుబడి లేక ఆదాయం రాలేదు. తర్వాత దిగుబడి పెరిగింది. సేంద్రియ ఎరువుకు తప్ప ఖర్చు లేదు. ఏడాదికి దాదాపు 2లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. పంట మొదలు పెట్టి దాదాపు ఐదేళ్లు కావొస్తుంది. మార్కెట్‌లో ఒక పండు రూ.150 నుంచి రూ.200 వరకు అమ్ముడుపోతుంది.



– దుగ్యానాయక్‌, ప్రభుత్వ ఉద్యోగి, పంతుల్‌తండా, అక్కన్నపేట మండలం

ఇద్దరు అదృశ్యం



మమత(ఫైల్‌)

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళ అదృశ్యమైన కేసు బుధవారం భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. ఎస్‌ఐ భువనేశ్వర్‌ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేశపాక కనకవ్వ, లింగం దంపతులకు కూతురు మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరేళ్ల క్రితం చేగుంట మండలం రాంపూర్‌ గ్రామానికి చెందిన ఆపర్ల కుమార స్వామితో మమతకు వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం భర్తతో గొడవపడి బంధువుల ఇంటికి వెళ్లింది. పది రోజుల తర్వాత తిరిగి అత్తగారింటికి వచ్చింది. అప్పట్లో ఈ విషయంపై చేగుంట పోలీస్‌ స్టేషన్‌లో కేసు పెట్టగా మమతకు పోలీసులు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అప్పటి నుంచి మమత పుట్టిల్లు వీరారెడ్డిపల్లిలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. పది రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన మమత తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థి..



మఠం కార్తీక్‌(ఫైల్‌)

సంగారెడ్డి మున్సిపాలిటీ: విద్యార్థి అదృశ్యమైన కేసు సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన మఠం కార్తీక్‌ (18) బుధవారం ఉదయం వాకింగ్‌ కోసమని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా దొరకలేదు. దీంతో కుటుంబ సభ్యులు సంగారెడ్డి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీధర్‌ రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08455276333 , 8712656718 నెంబర్లకు తెలపాలని కోరారు.

వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్ట్‌

నాటు తుపాకీ, మందుగుండు సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటుతుపాకీ, అధికారుల అదుపులో నిందితులు

నారాయణఖేడ్‌: అటవీ ప్రాంతంలో కుందేళ్లను వేటాడేందుకు నాటుతుపాకీతో సంచరిస్తున్న ఇద్దరిని గ్రామస్తులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నారాయణఖేడ్‌ ఫారెస్టు రేంజ్‌ అధికారి కె.చంద్రశేఖర్‌ తెలిపిన వివరాలు. నారాయణఖేడ్‌ మండలంలోని సంజీవన్‌రావుపేట్‌ శివారులో కొన్నేళ్లుగా పొలాల వద్ద బోర్లకు సంబంధించిన స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో రైతులు పహారా కాస్తున్నారు. మంగళవారం రాత్రి కల్హేర్‌ మండలం కృష్ణాపూర్‌ పంచాయతీ పరిధిలోని మెట్టుకుంట తండాకు చెందిన నేనావత్‌ రాములునాయక్‌, నేనావత్‌ జైపాల్‌ నాటు తుపాకీతో సంజీవన్‌రావుపేట్‌ అటవీప్రాంతంలో కుందేళ్లు, వన్యప్రాణులను వేటాడేందుకు వచ్చారు. వారిని రైతులు పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వీరి నుంచి నాటుతుపాకీ, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అటవీ చట్టం సెక్షన్‌– 21 ప్రకారం కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు ఫారెస్టు రేంజ్‌ అధికారి చంద్రశేఖర్‌ తెలిపారు. నాటుతుపాకులతో ఎవరైనా సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీశాఖ కల్హేర్‌ సెక్షన్‌ అధికారి ధన్‌సింగ్‌, మాద్వార్‌ బీట్‌ అధికారి దిగంబర్‌ పాల్గొన్నారు.

రూ.10 లక్షల డ్రగ్స్‌ పట్టివేత

పోలీసుల స్పెషల్‌ ఆపరేషన్‌



మాట్లాడుతున్న ఏసీపీ నరసింహారావు



స్వాధీనం చేసుకున్న నిషేధిత మందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిషేధిత టాబ్లెట్లు, ఇంజక్షన్లు (డ్రగ్స్‌) విక్రయించే ముఠాను కొల్లూరు పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు, యాంటీ డ్రగ్స్‌ కార్డ్‌ సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్‌ ఆపరేషన్‌ నిర్వహించి అరెస్టు చేశారు. ఈ సంఘటన బుధవారం కొల్లూరులో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు మియాపూర్‌ ఏసీపీ నరసింహారావు వెల్లడించారు. అహ్మద్‌ బిన్‌ అబ్దుల్‌ ఖాదర్‌ నగరంలోని చాంద్రాయణగుట్టలో జిమ్‌ నిర్వహిస్తుంటాడు. ఇందులో సరైన ఆదాయం లేకపోవడంతో మహ్మద్‌ ఇబ్రహీంతో కలిసి శరీర దృఢత్వాన్ని పెంచే నిషేధిత డ్రగ్స్‌ విక్రయించడం మొదలుపెట్టారు. వీరు కొల్లూరు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్‌ నిర్వహించారు. శరీర దృఢత్వం పెరిగే టాబ్లెట్స్‌ కావాలంటూ వారి వద్దకు మఫ్టీలో వెళ్లారు. వాటిని కొనుగోలు చేస్తామని మభ్యపెట్టి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో అహ్మద్‌ బిన్‌ అబ్దుల్‌ ఖాదర్‌, మహ్మద్‌ ఇబ్రహీంలను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా జిమ్‌లో ఉన్న నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. శరీర దృఢత్వం పెంపొందించే డ్రగ్స్‌ సీసాను రూ.300కు కొనుగోలు చేసి వాటిని రూ.వెయ్యి నుంచి రూ.1400కు అమ్ముతున్నారు. వీటిలో పశువులకు వాడే టాబ్లెట్లు, ఇంజక్షన్లు ఉండటం విశేషం. వీటిని ఉపయోగిస్తే త్వరగా అనారోగ్యానికి గురవడంతోపాటు గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుంది. వీటిని నిందితులకు నగరంలోని గాజుల దుకాణదారుడు, మీసేవ నిర్వాహకుడు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. త్వరలోనే డ్రగ్స్‌ సరఫరా చేసేవారిని పట్టుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్‌ డ్రగ్స్‌ కంట్రోల్‌ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రాజమౌళి, కొల్లూరు సీఐ సంజయ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే భూములు అమ్ముకోవడమా?

బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్‌ కమిటీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌



సంగారెడ్డిలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

కొండాపూర్‌(సంగారెడ్డి): గజ్వేల్‌ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ చేసిన అభివృద్ధి శూన్యమని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆయనను ఓడించేందుకు ప్రజలు ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారని బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్‌ కమిటీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ పేర్కొన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గజ్వేల్‌లో దళితులకు ఒక ఎకరా భూమి కూడా ఇవ్వని కేసీఆర్‌, గత ప్రభుత్వాలు ఇచ్చినా అసైన్డ్‌ భూమిని లాక్కొని కార్పొరేట్‌ శక్తులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి అంటే భూములు అమ్ముకోవడమేనా అని ప్రశ్నించారు?. గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కేసీఆర్‌ ఏనాడూ అందుబాటులో ఉన్నది లేదన్నారు. గజ్వేల్‌లో సీఎం ఓడిపోతారని పలు సర్వేలు చెప్పడంతోనే కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో గెలిచేది లేదన్నారు. సిట్టింగ్‌ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలోకి వెళ్తున్నారనే ముందస్తు సమాచారం ఉండడంతో.. మళ్లీ వారికే సీట్లు కేటాయించారని తెలిపారు. దళితబంధు పథకంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని, ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటున్నారని సీఎం కేసీఆర్‌ స్వయంగా ప్రకటించడం దారుణమన్నారు. ప్రజలు తిరస్కరిస్తున్న అభ్యర్థులకు టికెట్లు కేటాయించారని, వారు గెలిచే పరిస్థితి లేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, డబుల్‌ బెడ్‌ రూంల హామీలు ఏమయ్యాయన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అమలుకు నోచని హామీలు ఇచ్చి మళ్లీ గెలవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితబంధు, బీసీబంధు అంటూ కొత్త తాయిలాలను ప్రకటిస్తున్నారని, వాటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుటుంబపాలన, లంచగొండితనం, సొంతింటి కల నెరవేర్చని ప్రభుత్వం పోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ కార్యకర్త కేసీఆర్‌ అవినీతి, కుటుంబ పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌ రెడ్డి, సంగప్ప, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జైపాల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే రెండుచోట్ల పోటీ

కేసీఆర్‌కు ఓటమి భయం మొదలైందని, అందులో భాగంగానే గజ్వేల్‌, కామారెడ్డిలో పోటీచేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కందిలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ రెండూ ఒకటేనని.. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కూడా అదే పునరావృతం అవుతుందని చెప్పారు. ఇటీవల బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలను కుక్కలతో పోల్చడాన్ని తప్పుబట్టారు. మరో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్‌ కోవర్టులు ఉన్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఆ పార్టీలో గెలిచిన వారు కూడా బీఆర్‌ఎస్‌లోనే చేరతారని చెప్పడం చూస్తే రెండు పార్టీల రహస్య ఒప్పందం స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. కేసీఆర్‌కు స్పష్టమైన మెజార్టీ రాకపోతే కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలను తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. పొరపాటున కూడా కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌లకు ఓటు వేయకూడదని ప్రజలకు ఈటల విజ్ఞప్తి చేశారు.

మోటార్‌ కోసం మంజీరాలోకి దిగి..

- వ్యక్తి మృత్యువాత
- సంగాయిపేటలో ఘటన



గోపాల్‌ (ఫైల్‌)

కొల్చారం(నర్సాపూర్‌): మంజీరా నదిలో నుంచి మోటార్‌ను బయటకు తీసే ప్రయత్నంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మండలంలోని సంగాయిపేట గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎండబెట్ల మల్లేశం గౌడ్‌ మంజీరానది సమీపంలోని లిఫ్ట్‌ పక్కన పంట సాగు కోసం మోటారును ఏర్పాటు చేశాడు. మంగళవారం మోటార్‌ కాలిపోవడంతో దానిని నదిలో నుంచి బయటకు తీసేందుకు మంగలి గోపాల్‌(42)ను వెంట తీసుకెళ్లాడు. మల్లేశంగౌడ్‌ నది ఒడ్డుపై ఉండగా, గోపాల్‌ మోటార్‌ పైపు ద్వారా నదిలోకి దిగాడు. అతను ఎంతసేపటికి పైకి రాకపోవడంతో మల్లేశంగౌడ్‌ గ్రామస్తులకు సమాచారం అందించాడు. గోపాల్‌ కోసం నది చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో గ్రామస్తుల సమాచారం మేరకు కొల్చారం ఎస్‌ఐ గౌస్‌ ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐదు గంటల తర్వాత నదిలో మృతదేహం లభ్యమైంది. మోటారుకు ఎర్తింగ్‌ వచ్చి విద్యుదాఘాతంతో గోపాల్‌ చనిపోయి ఉండవచ్చని గ్రామస్తులు భావించారు. మృతుని భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



వేణుమాధవ్‌ (ఫైల్‌)

గజ్వేల్‌రూరల్‌: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గజ్వేల్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. పట్టణానికి చెందిన వేణుమాధవ్‌(36)కు భార్య, రెండేళ్లలోపు ఇద్దరు కవల అమ్మాయిలు ఉన్నారు. మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. బుధవారం సాయంత్రం ఎర్రకుంటలో యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీశారు. మృతుని వద్ద లభించిన గుర్తింపు పత్రాల ఆధారంగా వేణుమాధవ్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇతను పలు దినపత్రికలలో విలేకరిగా పనిచేశాడని, వ్యాపారాల్లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కొంతకాలంగా అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. గతంలోనూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటినుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వర్కింగ్‌ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కే. విరాహత్‌ అలీ, మిత్రులు సంతాపం వ్యక్తం చేశారు.

తీరు నచ్చక తండ్రిపై కుమారుల దాడి

తలకు తీవ్రగాయంతో మృతి



తిరుపతి(ఫైల్‌)

దుబ్బాకరూరల్‌: కుమారులు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్‌ వివరాలు. గ్రామానికి చెందిన చింతల తిరుపతి(50) స్థానికంగా ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇదే విషయంపై వారి కుటుంబంలో చాలాసార్లు గొడవలు జరిగాయి. అయినా తిరుపతి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 29న మధ్యాహ్నం మహిళను బైక్‌పై ఎక్కించుకుని సిద్దిపేట వైపు వెళ్లుతున్న తిరుపతిని కుమారులు గణేష్‌, భాస్కర్‌లు గమనించారు. రాంచంద్రనగర్‌ వద్ద బండిని ఆపడానికి ప్రయత్నించగా తప్పించుకుని వెళ్లి పోయాడు. అదేరోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి చేరుకున్నాడు. సదరు మహిళతో ఎందుకు తిరుగుతున్నావని కుమారులు, భార్య ఐలమ్మ నిలదీశారు. మాట మాట పెరగడంతో గణేష్‌ తన తండ్రిని నెట్టేయడంతో సిమెంట్‌ ర్యాంప్‌పై పడి తలకు తీవ్ర గాయమైంది. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బుధవారం మృతుని సోదరుడు చింతల రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారులు, భార్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయస్థాయి సైక్లింగ్‌కు..



మెమొంటో అందుకుంటున్న హర్షవర్ధన్‌ సాయి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండల పరిధి రామవరం ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న కె.హర్షవర్ధన్‌ సాయి జాతీయస్థాయి సైక్లింగ్‌కు ఎంపికైనట్లు కోచ్‌ సంజీవ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్‌ పీడీ, హ్యాండ్‌ బాల్‌ కోచ్‌ కనకయ్య, డీవైఎస్‌ఓ నాగేందర్‌, స్ఫూర్తి లయన్స్‌ క్లబ్‌ సిద్దిపేట డైరెక్టర్‌ సోమ కైలాసపతి, సత్యనారాయణ, ఈశ్వర్‌చరణ్‌ విద్యార్థికి మెమొంటోలు, సర్టిఫికెట్స్‌ అందజేశారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



దేవీసింగ్‌ (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పర్వతాపూర్‌ పంచాయతీ పరిధిలోని బాపనయ్య మోతుకుల తండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తండాకు చెందిన దేవిసింగ్‌ (28) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. అప్పుల బాధతో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి..



బసవరాజ్‌ (ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం మాసాయిపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసుల వివరాలు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కాలేరు గ్రామానికి చెందిన బసవరాజ్‌(22) ద్విచక్రవాహనంపై మాసాయిపేటకు వచ్చాడు. బైకును రైల్వే స్టేషన్‌ సమీపంలో నిలిపి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో కామారెడ్డి రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ వరలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థిని..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి రామచంద్రాపురంలో జరిగింది. పోలీసుల వివరాలు. పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌ కాలనీలో నివాసముండే సౌమ్య (17) ఇంటర్‌ వరకు చదివింది. ఆమె తండ్రి కృష్ణ కూరగాయల వ్యాపారి. మంగళవారం సౌమ్య కుటుంబ సభ్యులు మార్కెట్‌ వెళ్లారు. ఎవరూలేని సమయంలో ఆమె ఫ్యాన్‌ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటి పక్కన ఉండే బంధువులు గమనించి కృష్ణకు సమాచారం అందించారు. కాగా సౌమ్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్‌ కావడంతో మనస్తాపంతో మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



దశరథ్‌గౌడ్‌ (ఫైల్‌)

ములుగు(గజ్వేల్‌): ములుగు రాజీవ్‌రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ములుగు గ్రామానికి చెందిన చెట్టి దశరథ్‌గౌడ్‌(65) టీవీఎస్‌ వాహనంపై ఉదయం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తుండగా హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపు వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ్‌గౌడ్‌ కాళ్లు విరిగి తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కారు డ్రైవర్‌ శివానందరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలి



రేగోడ్‌: గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రేగోడ్ (మెదక్): రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని సీఐటీయూ నేత ఎండీ సర్దార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో బుధవారం మండలాన్ని సంగారెడ్డిలో కలపాలని కోరుతూ 14 అంశాలతో కూడిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగోడ్ మండలం మెదక్ జిల్లాలో ఉండటం కారణంగా నిరుద్యోగ యువత ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కోల్పోతోందని చెప్పారు. రైతులు సైతం విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారానికి నోచుకోలేకపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించాలి



దాదాయిపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ

టేక్మాల్(మెదక్): టెక్మాల్ మండలం దాదాయిపల్లిలో బుధవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ముగ్గురు ఎస్‌ఐలతో కలిసి మూడు బృందాలుగా విడిపోయి గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పత్రాలు లేని బైక్‌లు, ఆటోలను సీజ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నపూర్ణ, నర్సమ్మ తెలిపారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షా, ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీలను కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. డిమాండ్ల సాధనకు చేపట్టిన సమ్మెలో టీచర్లు, హెల్పర్లు, పాల్గొనాలని కోరారు. వారితో ఫరీద, పద్మ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ మీదుగా పాదయాత్ర

నర్సాపూర్: బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం నర్సాపూర్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి కేటాయించాలని కోరుతూ నాయకులు చేపట్టిన పాదయాత్రకు నర్సాపూర్‌లో నాయకులు స్వాగతం పలికారు. శివ్వంపేటకు బీఆర్‌ఎస్ నాయకుడు నవీన్‌గుప్తా ఆధ్వర్యంలో శివ్వంపేట నుంచి పాదయాత్ర చేపట్టారు. కాగా పాదయాత్ర నర్సాపూర్‌కు చేరగానే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, నర్సాపూర్ కౌన్సిలర్ అశోక్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులు ఘనస్వాగతం పలికారు. వారితో పాటు పట్టణ శివారు వరకు నడిచారు. మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని చేపట్టిన పాదయాత్ర బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని నవీన్‌గుప్తా తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రాజేందర్

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు కిషన్‌రెడ్డికి రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు పార్టీ బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

'వ్యాపారులతో కుమ్మక్కు'

నర్సాపూర్: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అక్రమ వ్యాపారులతో కుమ్మక్కయ్యారని, ఆయన అండదండలతోనే పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అక్రమ వెంచర్ల వ్యాపారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడారు. నర్సాపూర్‌కు చెందిన రాఘవేందర్‌రావు పట్టణ శివారులో పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూమి, సీలింగ్ భూములను కలిపి ఎమ్మెల్యే అండతో వెంచర్ ఏర్పాటు చేశాడని ఆరోపించారు. హెచ్‌ఎండీఏ అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. కొడిపల్లిలో జాతీయ రహదారిని ఆనుకుని వంద షెటర్లు ఎలా నిర్మించారని ప్రశ్నించారు. ఈ ఆరోపణలను నిరూపించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు.

చట్టబద్ధంగా సహాయం చేయాలి

- సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ అనిత



అధికారులతో సమీక్ష జరుపుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్: రాజీ చేయకలిగే కేసులలో కక్షిదారులకు పోలీసు అధికారులు చట్టబద్ధంగా సహాయం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత సూచించారు. బుధవారం కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సౌజన్యంతో సెప్టెంబరు 9వ తేదీన స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపడే కేసులకు చెందిన కక్షిదారులకు చట్టబద్ధంగా సహాయం చేయాలని సూచించారు. కక్షిదారులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పాదయాత్ర



శివ్వంపేటలో పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి నర్సాపూర్ టికెట్ కేటాయించాలని కోరుతూ శివ్వంపేటకు చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు నవీన్ గుప్తా బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్రను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి తదితరులు పాదయాత్రను ప్రారంభించారు. యాత్ర బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వివక్ష తగదు



డీఆర్‌ఓ పద్మశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం

మెదక్ కలెక్టరేట్: ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఎస్జీటీ టీచర్లపై వివక్ష తగదని, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పొందిన వారికి రెమ్యూనరేషన్ ఇవ్వాలని తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పద్మశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలలో జరిగిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో పాల్గొన్న టీచర్లకు టీ, స్నాక్స్, భోజన సౌకర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రాథమిక, హైస్కూల్ ఉపాధ్యాయుల మధ్య వివక్ష చూపడం సరికాదని, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ ఉపాధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను రక్షించాలి

- చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్



మాట్లాడుతున్న గంగాధర్

కౌడిపల్లి(నర్సాపూర్): బాలల హక్కులను కాపాడాలని చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ అన్నారు. బుధవారం కౌడిపల్లిలో ఐసీడీఎస్ అంగన్‌వాడీలో నిర్వహించిన మండల సెక్టార్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులకు భంగం కలిగించొద్దని, బాల్యవివాహాలు చేయడం, పిల్లలతో పనులు చేయించడం, వారిని రవాణా చేయడం నేరమని అన్నారు. సమస్యలుంటే చైల్డ్‌లైన్ 1098 ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్ రాయిలాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణలో సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు ఆరోగ్యలక్ష్మి ఒక్కపూట భోజనం నాణ్యతతో అందించాలన్నారు. కేంద్రాల నిర్వాహనలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ రమేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'హామీల అమలులో విఫలం'



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో తిరుపతి రెడ్డి

నిజాంపేట(మెదక్): మెదక్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నెరవేర్చలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నందగోకుల్ గ్రామానికి చెందిన ఉపసర్పంచి శ్రీనిధి భాస్కర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఇస్తానన్న రైతు రుణ మాఫీ డబ్బులు జమకాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ డిక్లరేషన్ వంద శాతం నెరవేరుస్తామని, ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీల రూ.6 లక్షలు, బీసీలకు రూ.5 లక్షల సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగం గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, మండల ఉపాధ్యక్షుడు అందే స్వామి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకి రాజయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, పంజా బాబు, లస్మగౌడ్, వెంకట్, రాంపూర్ ఉపసర్పంచ్ నర్సింలు, ఎండీ సులేమాన్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం



కుసంగిలో కార్యకర్తలతో కాంగ్రెస్ నాయకురాలు త్రిష

టేక్మాల్(మెదక్): ప్రజలకు కాంగ్రెస్ పార్టీయే అండగా ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నేత త్రిష అన్నారు. బుధవారం టేక్మాల్ మండలం కుసంగిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగమేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు త్రిషమ్మ-గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని గద్దెదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, ఎంపీటీసీ లచ్చమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు మాజర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓటరుగా నమోదు చేసుకోవాలి

అల్లాదుర్గం (మెదక్): సెప్టెంబర్ మూడో తేదీలోగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సతీశ్ కోరారు. ప్రతి గ్రామంలో బూత్‌లెవల్ అధికారులు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉన్నారని వారి వద్దకు వెళ్లి యువతీ యువకులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని పేర్కొన్నారు.

◆ యూరియా కొరత లేదు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని మెదక్ డివిజన్ వ్యవసాయ ఏడీఏ విజయ నిర్మల అన్నారు. బుధవారం మండలంలోని గవ్వలపల్లిలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేసి, నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ-పాస్ క్లియరెన్స్‌పై డీలర్లకు సూచనలిచ్చారు. అనంతరం రైతు రుణమాఫీ ప్రక్రియ గురించి డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ఎల్లయ్యతో మాట్లాడారు. రుణమాఫీ తంతును వెంటనే పూర్తిచేయాలని ఆమె కోరారు. ఆమె వెంట ఏఓ శ్రీనివాస్ ఉన్నారు.

◆ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్‌పై రెండువందల రూపాయలు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. పీఎం పాలనలో దేశం ముందు వరుసలో నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవింద్, మాజీ ఎంపీటీసీ హరిశంకర్, మాజీ సర్పంచ్ రఘువీర్‌రావ్, నాయకులు సంతోష్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేశ్, రాకేశ్, సాయిబాబా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్థానికంగా ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మోర్చా జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పోచమ్మ అశ్విని మాట్లాడుతూ, రాఖీ పండుగ సందర్భంగా ప్రధాని మహిళలకు కానుక ఇచ్చారన్నారు. ఆమె వెంట పార్టీ నాయకులు కుస్తీ శంకర్, చింతల శేఖర్, అల్లాడి రమేష్, పోచమ్మల శ్రీనివాస్, వెలుముల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక

రేగోడ్(మెదక్): మండలంలోని సిందోల్‌కు చెందిన సుమారు ఇరవై మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినట్లు జెడ్పీటీసీ యాదగిరి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దామోదర రాజనర్సింహ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. సిందోల్‌లో పార్టీ పూర్వ వైభవం సంతరించుకోబోతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అందోల్‌లో జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, రవి, సంగారెడ్డి, భగవాన్, భాస్కర్, పండరి, యాదయ్య తదితరులు ఉన్నారని చెప్పారు.

◆ వేతనాల పెంపుపై అర్చకుల హర్షం

పెద్దశంకరంపేట(మెదక్): తమకు గౌరవ వేతనం నెలకు రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసినందుకు అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దశంకరంపేట మండల అర్చకులు మాణిక్యప్రభు దేవాలయంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖర్, మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కృష్ణశర్మ, సంతోష్ శర్మ, రాము, గుడి రామన్న, సంగన్న, గిరి, వేణు తదితరులు ఉన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల మీసేవా నిర్వాహకులు తహసీల్దార్ గ్రేస్‌బాయికి బుధవారం వినతి పత్రం అందచేశారు. మీసేవా నిర్వాహకుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

◆ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరుకండి

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం కాస్లాపూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరుకావాలని గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

◆ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

మెదక్ కలెక్టరేట్: సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం మెదక్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరా గాంధీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీసి, కలెక్టర్ రాజర్షిషా, జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ అధ్యక్షురాలు స్వరూపారాణి, జేఏసీ అధ్యక్షుడు సాయికుమార్, జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, కోశాధికారి రాజ్యలక్ష్మి, కార్యదర్శులు బ్రహ్మాచారి, రమేష్ పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్యశిబిరం

చేగుంట(తూప్రాన్): మాల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం అనంతసాగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచు లక్ష్మి సిద్దిరాములు ప్రారంభించగా 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, సిబ్బంది వెంకటాద్రి, సురేష్, రాకేష్, నాయకులు ఉన్నారు.

◆ క్రమశిక్షణ అలవర్చుకోవాలి

తూప్రాన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నతంగా రాణించాలని ఎస్‌ఐ శివానందం అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మగుడి నిర్మాణం తలపెట్టారు. ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి దేవాలయం నిర్మించేందుకు సంఘం నేతలు ముందుకు రావడంతో శాస్త్రుల వామనశర్మ భూమి పూజ చేశారు.

నర్సింహారావు సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): న్యాయవాది నర్సింహారావు దేశ్‌పాండే సోదరులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం టేక్మాల్ మండలం దాదాయిపల్లిలో నర్సింహరావు లోక కల్యాణార్థం నిర్వహించిన గోశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు 18 సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషమని, ఇదివరకే చంద్రుతాండాలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గాప్రసాద్ దేశ్‌పాండే, విక్రమ్ దేశ్‌పాండే, ఎంపీపీ చింత స్వప్న, ఎంపీడీఓ భారతి, డాక్టర్ శాలిని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విక్రంగౌడ్, టేక్మాల్ సర్పంచ్ సుప్రజా, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర వాహనానికి ప్రమాదం

- ఆలస్యంగా మధ్యాహ్న భోజనం



ఉప్పులింగాపూర్-జంగరాయి శివారులో బోల్తాపడిన అక్షయపాత్ర వాహనం

చిన్నశంకరంపేట(మెదక్): అక్షయపాత్ర వాహనానికి ప్రమాదం జరగడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల, మోడల్‌స్కూల్, మడూర్, సూరారం జెడ్పీపాఠశాలలో అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. సంగారెడ్డి నుంచి బొలేరో వాహనంలో అక్షయపాత్ర మధ్యాహ్న భోజనం తీసుకొస్తారు. బుధవారం మండలంలోని జంగరాయి-ఉప్పులింగాపూర్ గ్రామాల మధ్య అక్షయపాత్ర మధ్యాహ్న భోజనం తీసుకొస్తున్న వాహనం బోల్తా పడటంతో అందులో ఉన్న భోజనం నేలపాలైంది. చివరకు మూడు గంటల సమయంలో మరో వాహనంతో భోజనం తీసుకొచ్చి విద్యార్థులకు అందించారు.

కూలీలుగా మారిన విద్యార్థులు

- అల్లాదుర్గం జెడ్పీస్కూల్‌లో వెలుగు చూసిన ఘటన



మెట్లు నిర్మాణ పనులు చేస్తున్న విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): బడిలో చదువు కోవాల్సిన విద్యార్థులు కూలీలుగా మారారు. చదువుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాల్సని వారు ఇసుక, ఇటుక మోస్తూ చెమటోర్చారు. ఈ ఉదంతం అల్లాదుర్గంలో వెలుగుచూసింది. మండల కేంద్రమైన అల్లాదుర్గం బాలుర జిల్లా పరిషత్ పాఠశాలకు ఒక వైపు మెట్లు లేవు. ఉపాధ్యాయులు వాష్‌రూంకు వెళ్లేందుకు కిందకు దిగేందుకు ఇబ్బందవుతోంది. అక్కడే గ్రౌండ్‌లోనే సీపీఎస్ ప్రాథమిక పాఠశాలకు చెందిన మన ఊరు మన బడి పనులు కొనసాగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇటుక, ఇసుకను విద్యార్థులతో మోయించారు. వాటిలో నిర్మాణం చేపట్టారు. చదువు చెప్పమని పిల్లలను పంపితే పనులు చేయిస్తారా? అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎం, టీచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పౌరహక్కులను ఉల్లంఘిస్తే చర్యలు



వెంకటాపూర్ కె గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



జీడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

నిజాంపేట (మెదక్): నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ కే గ్రామంలో బుధవారం మండల రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, సర్పంచ్ అనిల్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం, కుల వివక్ష, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, ఆలయాల ప్రవేశంలో ఆటంకాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పౌరుల హక్కులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాజలింగం, పోలీసు సిబ్బంది ఉప సర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు రాజు, రాజేందర్, జనగామ వెంకట్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లిలో..

మనోహరాబాద్(తూప్రాన్): మండంలంలోని జీడిపల్లిలో సివిల్ రైట్స్ డేను అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి హక్కులు, సాంఘిక సంక్షేమ పథకాలతో పాటు పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలు ఇలాంటి విషయాలపై అవగాహన కలిగి ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సోషల్ వేల్ఫేర్ అధికారి సురేష్, ఏఎస్‌ఐ చంద్రమోహన్, హెచ్‌ఎం వెంకటస్వామి, కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కలిసిమెలసి ఉండాలి

తూప్రాన్: మండలంలోని వెంకటాయిపల్లి గ్రామస్తులు రెవెన్యూ అధికారులు బుధవారం సివిల్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. దళితులను అంటరాని వారిగా చూడొద్దని, అందరు కలిసిమెలిసి ఉండాలన్నారు. దళితులకు ప్రభుత్వం కల్పిస్తులు పథకాలు, చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, నాయకులు రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



సరస్వతీ శిశు మందిర్‌లో రాఖీ కడుతున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యకారిణీ సభ్యులు పొద్దర్ ఉమా మాట్లాడుతూ.. ఒకరికొకరు రక్షగా ఉంటూ.. దేశానికి రక్షణగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులు, ప్రబంధకారిణి సభ్యులు ఒకరికొకరు రక్షలు కట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షులు మెంగని నారాయణ, సమితి కోశాధికారి మంకాల అశోక్, పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శి ఉప్పల మచ్చేంద్రనాథ్, ప్రధానాచార్యులు వెల్లంకి సుధా రాణి, ఆచార్యులు, సహ ప్రధానాచార్యులు ఆనంద్ రెడ్డి, స్వప్న, లక్ష్మి, చంద్రశేఖర్, దుర్గేష్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి సందడి గ్రామాల్లో నెలకొంది. మండలంలోని రంగంపేటలో రాఖీలు ఖరీదు చేసేందుకు తరలివచ్చారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని రామతీర్థం పాఠశాలలో బుధవారం రాఖీ వేడుకలు నిర్వహించారు. రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రామాయంపేట (మెదక్): మంజీరా విద్యాలయంలో బుధవారం రాఖీ వేడుకలు నిర్వహించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు చందాయిపేట, వల్లాపూర్ ప్రాథమిక పాఠశాల, చేగుంట బ్రిలియెంట్, కృష్ణవేణి పాఠశాలల్లో రాఖీ వేడుకలు చేశారు.